సాక్షి
జోగులాంబ గద్వాల

శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025

గరిష్టం/కనిష్టం
34.6 /22.2

వాతావరణం
ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రేవతి



ధరూరు: మండలంలోని జాంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేవతి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. అత్యధికంగా డ్రాపౌట్ ఎన్‌రోల్‌మెంట్ చేయడం, టీఎల్‌ఎం, కల్చరల్ కార్యక్రమాలు వంటి పది అంశాలకు సంబంధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అందులో ప్రధానంగా ధరూరు, జాంపల్లి పాఠశాలల్లో పని చేసిన క్రమంలో చేసిన పనులకుగాను గుర్తింపు దక్కింది. శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్ప కళావేదిక, శిల్పారామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. చేసిన మంచి పనులను గుర్తించి ప్రభుత్వం అవార్డు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని రేవతి తెలిపారు. ఇదిలాఉండగా, మండల ఉపాధ్యాయురాలికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు రావడంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తోటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగించుకోవాలి



గద్వాల: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని వృద్ధిచెందాలని అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం అయిజ మండలం ఈడిగోనిపల్లికి చెందిన ఎస్సీ కులానికి చెందిన మనీషా వీరేంద్ర కులాంతర వివాహం చేసుకున్నారు. ఇందుకుగాను ప్రభుత్వ పథకం ద్వారా రూ.2.50లక్షల ప్రోత్సాహక బహుమతిని మంజూరీ చేసినట్లు తెలిపారు. ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో వీరికి బాండ్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమాభివృద్ధి శాఖ జిల్లా అధికారి సుశిత, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలు అమలు చేయాలి



గద్వాల: డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను గౌరవించి వాటిని ఖచ్చితంగా అమలు చేయాలని సీనియర్ సిటీజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కె.మోహన్‌రావు కోరారు. ఈమేరకు ఆయన గురువారం కలెక్టర్ బీఎం సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పరమాల శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఇళ్ల స్థలాలు కోల్పోయిన వారికి ఇళ్లను కేటాయించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇదిలా ఉండగా ఈ నెల 6వ తేదీన రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించిన పట్టాలను ఇదివరకే కేటాయించిన లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిసింది. ఈనేపథ్యంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలుచేయాలని కోరగా హైకోర్టు ఆదేశాలను అమలు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు మోహన్‌రావు తెలిపారు.

మార్గదర్శకులు!

సృజనాత్మకత జోడించి ఆకట్టుకునేలా కృత్యాధార బోధన

- అన్ని రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు
- నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



బోర్డుపై చిత్రాలు గీచి.. పాఠ్య పుస్తకాల్లోని ఫొటోలు చూపించి విద్యార్థులకు బోధించడం లాంటి మూసధోరణికి స్వస్తి పలికి.. సాంకేతికతను జోడించి పాఠ్యాంశాలను కళ్లకు కట్టేలా యానిమేషన్ వీడియోలు చూపిస్తూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు కొందరు ఉపాధ్యాయులు. ఒక్కో పాఠ్యాంశం చాలా కాలం గుర్తుండేలా వినూత్న బోధన పద్ధతులతో విద్యార్థులకు బోధిస్తూ.. పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీసి.. రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్లలో ఉత్తమ ప్రతిభ కనబర్చేలా సంసిద్ధం చేస్తున్నారు. మొత్తంగా గ్రామీణ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకునేలా తీర్చిదిద్దుతూ ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా నిలుస్తున్నారు. శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. - గద్వాల టౌన్



విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్న ధరూరు మండలం మార్లబీడు జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు ఎల్లస్వామి

విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఉపకరణాలతో ప్రయోగ పూర్వకంగా ధరూరు మండలం మార్లబీడు జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు ఎల్లస్వామి విజ్ఞాన శాస్త్రాన్ని బోధిస్తున్నాడు. విద్యాభివృద్ధితో పాటు విద్యార్థులకు విజ్ఞానశాస్త్రం పట్ల అభిరుచి కలిగి, పరిశోధనా, పరిశీలనాశక్తి, శాస్త్రీయ నైపుణ్యాలు అలవడేలా కృషి చేస్తున్నారు.

సైన్స్ ప్రయోగాలలో దిట్ట

పాఠశాలలోని ఓ గదిలో సైన్స్‌కు సంబంధించిన వివిధ అంశాలతో ప్రయోగాలను ఏర్పాటు చేశారు. ఇందులో మానవ శరీరంలోని అవయవాలు, రక్త నమూనాలు మొదలుకొని వాటి పనితీరు వివిధ అంశాలపై క్షుణ్ణంగా చార్టులు, నమూనాల ద్వారా ప్రదర్శించారు. పాఠ్యంశాల్లోని అంశాలనే వివిధ ఉపకరణాల ద్వారా ప్రయోగపూర్వకంగా బోధిస్తూ ఆకట్టుకుంటున్నాడు. 2022లో ఎల్లస్వామి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. 2017 తొలి తెలంగాణ ప్రతిభ అవార్డు కింద రూ.50 వేలు నగదు పురస్కారాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా అందుకున్నారు. నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌లో రాష్ట్రస్థాయి అవార్డుతో పాటు పలు అవార్డులను ఎల్లస్వామి అందుకున్నారు.

తెరపై చూపుతూ... విజ్ఞానం వెలిగిస్తూ..



పాఠాలు బోధిస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుడు రవిశంకర్

చెప్పడం కంటే చూపిస్తే పిల్లలకు పాఠాలు సులభంగా అర్థమవుతాయన్నది నిజం. గత కొన్నేళ్లుగా ఇదే విధానాన్ని పాటిస్తున్నారు ఉండవెల్లి మండలం పుల్లూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడి రవిశంకర్. తన సబ్జెక్టు పాఠాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్, యానిమేషన్ వీడియోలు సొంతగా రూపొందిస్తున్నారు. టీవీ, కంప్యూటర్ల ద్వారా విద్యార్థులకు వీటిని చూపిస్తూ, వివరిస్తూ బోధిస్తున్నారు. దీనికే పరిమితం కాకుండా పాఠ్యాంశాలపై విద్యార్థుల చేత ప్రయోగాలు చేయిస్తుంటారు. అందులో భాగంగా జీవశాస్త్ర సంఖ్యా క్యాలెండర్, జీవశాస్త్ర వైకుంఠపాళి, జీవశాస్త్ర పదవినోదం లాంటి వినూత్న అంశాలతో బోధనను కొనసాగిస్తూ రాష్ట్రస్థాయిలో అందరి మన్ననలను పొందుతున్నారు. ఇటీవల ఎస్‌సీఆర్‌టీ ఆధ్వర్యంలో జరిగిన విద్యా అమృత్ మహోత్సవంలో వర్చువల్ రియాలిటీ 'సాంకేతిక పరిజ్ఞానంతో జీవశాస్త్ర బోధన' అనే అంశం రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచి, జాతీయ స్థాయికి ఎంపికైంది. ప్రయోగాత్మకంగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులపై 3డీలో చూపుతూ బోధన చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించిన అనేక సెమినార్లు, పోటీలలో పాల్గొని సత్తా చాటారు. వినూత్నంగా రూపొందించిన జీవశాస్త్ర సంఖ్యా క్యాలెండర్-2021కు గాను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. దీంతోపాటు అధునాతన సాంకేతికను జోడించి ప్రత్యేకంగా ఓ యాప్‌తో తన సెల్‌ఫోన్‌ను ప్రొజెక్టర్‌కు అనుసంధానించి స్క్రీన్‌పై బొమ్మను చూపిస్తూ విద్యార్థులకు పాఠ్యంశాలను అర్థమయ్యేలా బోధిస్తున్నారు. అంతేకాక నూతన జాతీయ విద్యా విధానం–2020కి సంబంధించిన పలు అంశాలతో తెలుగులో డిజిటల్ పోస్టర్‌ను రూపొందించి జాతీయస్థాయి గుర్తింపు సాధించారు. వీటితో పాటు వివిధ అంశాల్లో ప్రావీణ్యం సాధించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారు.

ఉపకరణాలతో బోధన భళా..



ప్రయోగాత్మకంగా బోధిస్తున్న గద్వాల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నాగరాజు

పాఠాల బోధన ఒక్కటే కాదు.. వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి విద్యార్థులను ప్రేరేపించడమూ గురువుల బాధ్యతంటారు గద్వాల ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు నాగరాజు. పిల్లల్లో అన్వేషణ సామర్థ్యం, అందుకు అవసరమైన జిజ్ఞాస మెండుగా ఉంటుందని నమ్మి.. వినూత్న బోధనోపకరణాలు వినియోగించి పాఠాలు బోధిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బోధనలో డిజిటల్ బోర్డులను సమర్ధవంతంగా వినియోగిస్తున్నారు. స్వతహాగా పాఠ్యాంశాలకు సంబంధించిన వీడియోలు రూపొందించి బోధన అందిస్తున్నారు. విద్యార్థులకు గూగుల్ ఫామ్ ద్వారా ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించి ప్రోత్సహిస్తున్నారు. సొంతంగా బోధనోపకరణాలు, ప్రాజెక్టులు తయారు చేయడంతో పాటు విద్యార్థుల చేత చేయిస్తున్నారు. 2022లో, 2024లో దక్షిణ భారత స్థాయిలో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో బహుమతులు సాధించారు. పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మెటీరియల్స్ రూపొందించండం, పోటీ పరీక్షలకు విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు.

బాల మేధావులుగా తీర్చిదిద్దుతూ..



రాష్ట్ర స్థాయిలో సైన్స్ ప్రదర్శనలో విద్యార్థులతో ఉండవెల్లి ఉన్నత పాఠశాల జీవశాస్త్రం ఉపాధ్యాయురాలు లక్ష్మి

ఉండవెల్లి: విద్యార్థుల మేధోశక్తికి పదును పెడుతూ.. కొత్త కొత్త ఆలోచనలకు కార్యరూపం దాల్చుతూ.. వారిని భవిష్యత్ సైంటిస్టులుగా తీర్చిదిద్దాతున్నారు ఉండవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్రం ఉపాధ్యాయురాలు లక్ష్మి ఖర్చు లేకుండా, సులువుగా దుస్తులు తయారు చేసే యంత్రాన్ని విద్యార్థులచే తయారు చేయించి సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించడంతో రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు.ఎన్‌ఆర్‌ఐల సహాయంతో కొందరు విద్యార్థులను ఇస్రోకి తీసుకెళ్లి సైన్స్‌పై మరింత మక్కువ పెంచారు. మెదడుకు పదును పెట్టే చెస్ బోర్డులను అందజేశారు. ఇదే పాఠశాలలో 2007–08లో పదో తరగతి చదివిన కృష్ణ అనే విద్యార్థి ప్రస్తుతం ఇస్రోలో విధులు నిర్వహిస్తున్నారు. పదో తరగతిలో సైన్స్ టీచర్ లక్ష్మి వల్లే సైన్స్‌పై మక్కువ పెరిగిందని, ఈ రంగం వైపు వచ్చానని పూర్వ విద్యార్థి కృష్ణతోపాటు పలువురు చెప్పుకొచ్చారు.

నయనానందం.. వినాయక నిమజ్జనం

గద్వాలలో నిమజ్జనోత్సవానికి తరలుతున్న గణనాథుడు



గద్వాలటౌన్: బోలో గణేష్ మహారాజ్ కీ జై.. గణపతి బప్పా మోరియా.. అంటూ భక్తుల నినాదాలతో గద్వాల పుర వీధులు పులకించాయి. తొమ్మిది రోజులపాటు భక్తుల అశేష పూజలందుకున్న వినాయకుడు తల్లి ఒడికి చేరుకున్నాడు. జిల్లా కేంద్రంలోని ఆయా వీధుల్లో ప్రతిష్టించిన భారీ గణనాథుల విగ్రహాలను గురువారం రాత్రి నిమజ్జనం చేశారు. వివిధ ఆకృతులలో ఏకదంతుడిని తీర్చిదిద్దిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన పలు గణేష్ మండపాలలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు వేర్వేరుగా వినాయకుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గణేష్ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. నిమజ్జనోత్సవం యువకులు, పెద్దల నృత్యాలు, భజనలతో కోలాహలంగా సాగింది.



డ్రమ్స్ వాయిస్తున్న కళాకారులు



నృత్యం చేస్తున్న మహిళలు

డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీకి సర్వం సిద్ధం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: పరమాల శివారులో రూ.85కోట్లతో నిర్మించిన 1,275 డబుల్ బెడ్‌రూంలలో 715 ఇళ్లను ఇదివరకే లబ్ధిదారులకే కేటాయించడం జరిగిందని, వీటిని ఈనెల 6వ తేదీన లబ్ధిదారులకు అందిస్తున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. మంత్రి పొంగులేటి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగనున్నందున అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా అన్ని బ్లాకులో తాగునీటి వసతి, విద్యుత్ సదుపాయం, డ్రైనేజీ వ్యవస్థ వంటివి, ఎక్కడైనా మిగిలిపోయిన పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని ఇళ్లకు రంగులు వేయడం పూర్తి చేసి తోరణాలతో అలంకరించాలన్నారు. అదేవిధంగా ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా పటిష్టమైన పోలీసుబందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వి.లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, హౌసింగ్‌పీడీ శ్రీనివాస్ రావు, ఆర్డీఓ అలివేలు, డీపీవో నాగేంద్రం, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి హృదయరాజు

అలంపూర్: కళాశాల విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసించాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హృదయరాజు అన్నారు. అలంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. మొదట తరగతి గదులను పరిశీలించి అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి పురగతిపై ఆరా తీశారు. గణితం, ఇంగ్లీష్, తరగతులను బోధించడంతోపాటు వారి అనుమానాలను నివృత్తి చేశారు. క్రమం తప్పకుండా కళాశాలకు రావాలని, హాజరు శాతం తక్కువగా ఉంటే వచ్చే ఇబ్బందులను వివరించారు. ఒక ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి. అధ్యాపకులు సుధారాణి, అభిజ్ఞ, మౌనిక, రాజు, రాముడు, రామచంద్రయ్య, రఘువీర్ కుమార్, మల్లయ్య, ఆర్. రాముడు, తిరుపాల్ పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

గట్టు: మహిళలు స్వయం ఉపాధి వైపు దృష్టిని సారించి, ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ శ్రీనివాస్ సూచించారు. గురువారం మండల మహిళా సమాఖ్యలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళా సంఘాలు బలోపేతం కావడానికి సంఘం సభ్యులందరూ సహకరించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలకు గొర్రెలు, గేదెలు పెంపకంతో పాటుగా ఇతర పరిశ్రమలు ఏర్పాటు సహకారం అందిస్తున్నట్లు వివరించారు. కిరాణ షాపు, హోటల్స్ వంటి వాటి ధర ఆదాయ మార్గాలను పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకోవాలని కోరారు. సేంద్రియ పద్ధతిలో పంటలను పండించాలని కోరారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నయ్య, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, ఎంఎస్ఎస్ కార్యవర్గ సభ్యురాలు వెంకటేశ్వరి, అక్షర ఇన్‌చార్జ్ ఏపీఎం జయాకర్, సీసీలు ఆంజనేయులు, రామకృష్ణ, జ్యోతి, దేవదాస్ పాల్గొన్నారు. ఇదిలాఉండగా, సమాఖ్యలో 10 ఏళ్లుగా సీసీలుగా పని చేస్తూ, బదిలీపై వెళ్తున్న ఇన్‌చార్జ్ ఏపీఎం జయాకర్, సీసీలు రామకృష్ణ, సుదర్శన్‌ను సన్మానించి, అభినందించారు.

పంట సాగు వివరాలు నమోదు చేయాలి



జల్లాపురంలో పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్

మానవపాడు: మండలంలోని జల్లాపురం గ్రామంలో గురువారం పంట నమోదు కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్ పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వ్యవసాయ విస్తరణ అధికారులు చేసిన పంటల బుకింగ్ వివరాలు, పొలం వద్ద తీసిన ఫొటోలు వివరాలను పరిశీలించి ధృవీకరించారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి పరిధిలోని 2000 ఎకరాల్లో విస్తీర్ణనానికి డిజిటల్ పంట బుకింగ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా ఏఈఓ తప్పనిసరిగా ప్రత్యక్షంగా పొలం వద్దకు వెళ్లి, అక్కడి పంటల ఫొటోలు డీసీఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, ఫొటోలు తీసేటప్పుడు లాటిట్యూట్, లాంగిట్యూడ్ వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. మండలంలో పత్తి పంట 19800, మిర్చి 4000, కంది 1950, మొక్కజొన్న 750, వరి 221ఎకరాలలో మండల వ్యాప్తంగా పంటలను రైతులు సాగుచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కళాఉత్సవ్ పోటీలు



జానపద నృత్య ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న విద్యార్థినులు



విద్యార్థినుల ఆదివాసీ గోండు నృత్యం

గద్వాలటౌన్: పల్లెజీవనం ప్రతిబింబించే నృత్యాలు.. సంస్కృతిలో ఆచార వ్యవహారాల ప్రదర్శనలు.. శాస్త్రీయ జానపద నృత్యాలు ఇలా ఎన్నో భారతీయ కళలు ఉట్టిపడేలా జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు సాగాయి. విద్యాశాఖ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో రెండోరోజు గురువారం స్థానిక బాలభవన్‌లలో జరిగిన జిల్లాస్థాయి పోటీలను డీఈఓ అబ్దుల్ ఘనీ పరిశీలించారు. జానపద నృత్యాలు, నాటికలు, బుర్రకథలు, చిత్రలేఖనం తదితర విభాగాలలో పోటీలు జరిగాయి. ఆయా పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ అద్భుతమైన ప్రతిభతో ఆకట్టుకొని న్యాయ నిర్ణేతల మెప్పు పొందారు. సందేశాత్మకమైన అంశాలతో పలువురు విద్యార్థులు నాటికలు నిర్వహించి మెప్పు పొందారు. బుర్ర కథలతో ఆకట్టుకున్నారు. మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి డీఈఓ అబ్దుల్‌ఘనీ మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలతో మానసికోల్లాసంతో పాటు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సిద్ధిస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. విద్యార్థులలో సృజనాత్మక శక్తి వెలికితీయడానికి కళా ఉత్సవ్ పోటీలు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా సమన్వయ అధికారిణి ఎస్తేర్‌రాణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైంది వీరే

గాత్ర సంగీతం సోలో విభాగంలో గద్వాల మైనార్టీ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థిని తస్లీమ్, గాత్ర సంగీతం గ్రూప్ విభాగంలో గద్వాల బాలుర గురుకుల పాఠశాలకు చెందిన నాని బృందం ప్రథమ స్థానంలో నిలిచారు. సంగీతం సోలో విభాగంలో అగస్త్య పబ్లిక్ స్కూల్‌కు చెందిన వీవేక్ వర్ధన్, గ్రూపు విభాగంలో గద్వాల బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన కర్రెప్ప, రవి, దర్మ, మల్లికార్జున్ బృందం మొదటి స్థానంలో నిలిచారు. శాస్త్రీయ నృత్యం సోలో విభాగంలో ఎస్ఎస్‌వీఎం స్కూల్‌కు చెందిన విద్యార్థిని జ్యోత్స్న, శాస్త్రీయ నృత్యం గ్రూప్ విభాగంలో విశిష్ట నోబుల్ స్కూల్‌కు చెదిన హరిణి బృందం మొదటి స్థానంలో నిలిచారు. చిత్రలేఖనం, పెయింటింగ్ విభాగంలో మాంటిస్సోరి స్కూల్ విద్యార్థి ఆయేషా ఆఫ్రీన్, థియేటర్ విభాగంలో గద్వాల విద్యార్థి ఉదయ్‌కిరణ్ ప్రథమ స్థానంలో నిలిచారు. దృశ్య కళలు 2డీ సోలో విభాగంలో కొట్టం మాణిక్యమ్మ కళాశాల విద్యార్థిని సుదేక్ష నిలిచారు.

తప్పని యూరియా తిప్పలు



గట్టు పీఏసీఎస్ వద్ద యూరియా కోసం క్యూలో కవర్లు ఉంచి ఎదురుచూస్తున్న రైతులు

గట్టు: రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదు. యూరియా కోసం రైతులు తెల్లవారుజామున నుంచి చీకటి పడే దాకా పీఏసీఎస్ దగ్గర పడిగాపులు పడుతున్నారు. గురువారం యూరియా కోసం రైతులు ఉదయమే గట్టులోని పీఏసీఎస్ వద్దకు చేరుకున్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు, జిరాక్స్ పత్రాలతో కూడిన కవర్లు క్యూలో పెట్టి ఎదురు చూశారు. గత నెల 30న టోకెన్లు అందుకున్న వారికి మాత్రమే గురువారం యూరియా బస్తాలను అందజేశారు. మొత్తం 600 బస్తాలను అందించినట్లు తెలిపారు. ఇక తాజాగా టోకెన్లు అందుకున్న రైతులకు వచ్చే సోమ, మంగళవారాల్లో యూరియా బస్తాలను అందిస్తామని పీఏసీఎస్ అధికారులు తెలిపారు. వ్యవసాయ అధికారులు, పోలీసుల సహకారంతో రైతులకు టోకెన్లు అందజేశారు. ఇదిలాఉండగా, రోజుల తరబడి యూరియా కోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొన్నట్లు రైతులు వాపోయారు.

8న అప్రెంటిషిప్ మేళా

గద్వాల: జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డులో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేళాలో హైదరాబాద్‌కు చెందిన వివిధ ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయని, ఐటీఐ పాస్ అయిన అభ్యర్థులు మేళాలో పాల్గొనాలని సూచించారు. మేళాకు హాజరయ్యే అభ్యర్థులు వారి అర్హతకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒకసెట్ జిరాక్స్ వెంట తీసుకుని రావాలని తెలిపారు. ఉదయం 10గంటలకు మేళా ప్రారంభం అవుతుందని, వివరాలకు సెల్ నం. 8500464782, 8341441763 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

గల్లంతైన దంపతుల మృతదేహాలు లభ్యం



తాటికుంట రిజర్వాయర్‌లో లభ్యమైన రామిడు, సంధ్య మృతదేహాలు

మల్దకల్: రిజర్వాయర్‌లో పుట్టీ సాయంతో చేపలు పట్టేందుకు వెళ్లిన దంపతులు గల్లంతు కాగా.. గురువారం వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. పూర్తి వివరాలిలా.. మల్దకల్ మండలంలోని తాటికుంట రిజర్వాయర్‌లో మంగళవారం సాయంత్రం దంపతులు బోయ దుబ్బోనిబాయి రాముడు, సంధ్య చేపలవేటకు ఎంతకూ తిరిగి ఇంటికి రాకపోవడంతో వారి ఆచూకీ కోసం రెండు రోజుల పాటు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు రిజర్వాయర్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు గురువారం తెల్లవారుజామున దంపతుల మృతదేహాలు నీటిలో తేలుతూ కనిపించడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అధికారులకు సమాచారం అందించారు. అనంతరం మల్దకల్ పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నందీకర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

నవాబుపేట: పంట పొలానికి వేసిన విద్యుత్ కంచె తగిలి మహిళ మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని జంగమయ్యపల్లికి చెందిన కంచె కిష్టమ్మ(40) గ్రామ సమీపంలో కుమ్మరి రాములు వ్యవసాయ పొలంలో మొక్కజొన్న పంటకు వేసిన విద్యుత్ కంచె వల్ల షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు కుటుంబ సభ్యులు సమాచారం అందించగా కిష్టమ్మ కుమారుడు నరేష్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు.

తండ్రిపై కుమారుడి దాడి: కారు డిక్కీలో తరలింపు

కల్వకుర్తిటౌన్: వ్యవసాయ పొలం వద్ద ఉన్న కన్నతండ్రిపై కర్రతో దాడిచేసి అక్కడి నుంచి కారులో డిక్కీలో తరలించిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లో వెళ్తే.. పట్టణంలోని వాసవీనగర్‌లో నివాసముంటున్న రైతు బాలయ్య(70) పొలం వద్ద ఉండగా.. బుధవారం సాయంత్రం కుమారుడు బీరయ్య తండ్రిపై కర్రతో దాడిచేసి కారు డిక్కీలో వేసుకొని పరారయ్యాడు. రాత్రివరకు బాలయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా.. ఎక్కడా ఆచూకీ దొరకలేదు. దీంతో గురువారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా.. రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా.. కుమారుడు బీరయ్యనే దాడి చేసి కారులో తీసుకెళ్లినట్లు గుర్తించి అతనికోసం గాలిస్తున్నారు. 24గంటలు గడిచినా వృద్ధుడి ఆచూకీ లభించకపోవడం, దాడికి పాల్పడిన కుమారుడు పరారీలో ఉండడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై కల్వకుర్తి సీఐ నాగార్జునను వివరణ కోరగా.. గాయపడ్డ వృద్ధుడిని ఆస్పత్రిలో చేర్పించాడా? లేదా ఏమైనా చేశాడనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జగదీశ్వర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం


మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, కుటుంబసభ్యులు

- రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఆయనది ఎంత ఎదిగినా ఒదిగి ఉండే నైజం: మంత్రి వాకిటి శ్రీహరి
- పాలమూరులో మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి విగ్రహావిష్కరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: మాజీ ఎమ్మెల్సీ జగదీశ్వర్‌రెడ్డి ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా పదేళ్లపాటు సుదీర్ఘకాలంగా పని చేశారని, పార్టీ యంత్రాంగాన్ని నడపాలంటే ఆయన్ను చూసి నేర్చుకోవాలని, పార్టీకి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మహబూబ్‌నగర్ పద్మావతీకాలనీలోని గ్రీన్‌బెల్టులో గురువారం మాజీ ఎమ్మెల్సీ ఎస్.జగదీశ్వర్‌రెడ్డి విగ్రహావిష్కరణలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ పార్టీ పరమైన అంశాల్లో, ఇతర సమస్యల్లో ఎవరి మనసు నొప్పించక ప్రజాస్వామికబద్ధంగా వ్యవహరించేవారని అన్నారు. ఆనాడు పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో జిల్లా నుంచి ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో అంచలంచెలుగా ఎదిగారని అన్నారు. రాజకీయాలకు సరైన వ్యక్తిగా ఆయన జీవన ప్రయాణం కొనసాగిందన్నారు. జీవితంలో ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం ఆయననే చూసే నేర్చుకోవడం జరిగిందన్నారు. ఎంపీ డాక్టర్ మల్లురవి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డి ఆదర్శప్రాయుడని, కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు అందించారని అన్నారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డితో తనకు ఎంతో ఆత్మీయత అనుబంధం ఉందన్నారు. మొదట్లో నాకు రాజకీయాలు వద్దని చెప్పారని, తర్వాత నాకున్న ఆసక్తితో రాజకీయాల్లో ఎంతో ప్రోత్సహించారని గుర్తుచేశారు. మాజీ ఎంపీ వి.హనుమంతురావు మాట్లాడుతూ జగదీశ్వర్‌రెడ్డి నిరుపేదలకు సహాయం చేయడంలో ముందుండేవారని అన్నారు. ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, యశస్వినిరెడ్డి, కార్పొరేషన్‌ల చైర్మన్లు గురునాథ్‌రెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్, కోదండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు భానుప్రకాశ్, యాదవరెడ్డి తదితరులు జగదీశ్వర్‌రెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ నందిని, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, ఎన్‌పీ. వెంకటేశ్, చంద్రకుమార్‌గౌడ్, భగవంతురావు, సీజే బెనహర్, ప్రశాంత్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, జహీర్ అఖ్తర్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు


క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌ల్లో తలపడుతున్న క్రీడాకారులు

క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లు పూర్తి
- నేటి నుంచి మెయిన్ డ్రా పోటీలు
- ప్రేక్షకులతో కిటకిటలాడిన ఇండోర్ స్టేడియం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో 11వ రాష్ట్రస్థాయి జూనియర్ (అండర్–13) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు సంబంధించి 225 క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లు గురువారం ఉత్సాహంగా జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. క్వాలిఫైయింగ్ మ్యాచ్‌ల్లో ప్రతిభ కనబరిచిన వారు శుక్రవారం నుంచి జరిగే మెయిన్ డ్రాకు అర్హత సాధించారు.

శుక్రవారం ఉదయం ప్రారంభోత్సవం...

రాష్ట్రస్థాయి అండర్–13 బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్నాయని మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌గౌడ్, రవికుమార్ తెలిపారు. ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లను వారు పరిశీలించారు. నాలుగు సింథటిక్ కోర్టుల్లో సింగిల్, డబుల్స్ పోటీలు జరుగుతాయని, ఈ నెల 7న చాంపియన్‌షిప్ ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో టోర్నీ పరిశీలకుడు సుధాకర్, రెఫరీ కిషోర్, జిల్లా సంయుక్త కార్యదర్శులు నాగరాజుగౌడ్, విజయ్‌రెడ్డి, ఎంపీ.ప్రవీణ్, సభ్యులు శశాంక్ పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయానికి అటవీ భూమి

ఆలయ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి


సమస్య పరిష్కారంపై వివరాలు ప్రకటిస్తున్న ఆలయ చైర్మన్, సభ్యులు

నవాబుపేట: జిల్లాలో ప్రసిద్ధిచెందిన పర్వాతాపూర్ మైసమ్మ ఆలయానికి అటవీ భూమి కోసం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ద్వారా ప్రత్యేక ప్రతిపాదన చేసినట్లు మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మైసమ్మ ఆలయానికి అదనంగా 4.0889 హెక్టార్ల (దాదాపు పది ఎకరాలు)అటవీ భూమి కోసం ప్రత్యేక వినతిని జడ్చర్ల ఎమ్మెల్యే ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనికి సంబంధించి కలెక్టర్ అటవీ భూమిలో సంబంధిత అధికారులతో సర్వే చేయించి అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాగా, కేంద్ర కార్యాలయం తుది అనుమతి రావాల్సి ఉందని.. దీనికి త్వరలోనే అనుమతులు తీసుకొచ్చేలా చేస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలియజేశారు.

ఆలయ సిబ్బందికి పెరిగిన వేతనాలు

కొన్నేళ్లుగా ఆలయంలో వివిధ రకాల పనులు చేస్తున్న వారికి కనీస వేతనాలు పనికి తగ్గట్లుగా అందేవి కావు. దీంతో వారు చాలా ఏళ్లుగా కనీస వేతనం కోసం జడ్చర్ల ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించడంతో తాజాగా 6 కూలీలకు కనీస వేతనం అందించే జీఓ బుధవారం వచ్చిందని మైసమ్మ ఆలయ చైర్మన్ తెలిపారు. దీంతో గతంలో నెలకు రూ.7500 అందించే వేతనాన్ని రూ.12వేలకు పెంచినట్లు పేర్కొన్నారు. అలాగే వంశపారంపర్యంగా ఆలయంలో పనులు చేసే మరో వ్యక్తికి సంబంధించి పర్మినెంట్ వేతనం మంజూరు చేస్తూ ప్రభుత్వం గజిట్ ఇచ్చిందని తెలిపారు. దీంతో ఆలయంలో ఉన్న పెండింగ్ సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు చైర్మన్‌తోపాటు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు ఇబ్బంది లేకుండా పంపిణీ చేయాలి

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి


హాకా రైతుసేవా కేంద్రం వద్ద పంపిణీ గురించి చైర్మన్ కోదండరెడ్డికి వివరిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ చేయాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మహబూబ్‌నగర్ అర్బన్ మండల పరిధిలోని బోయపల్లిరోడ్‌లో గల హాకా రైతు సేవా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా యూరియా పంపిణీ ప్రక్రియను మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. యూరియా కొరత లేకుండా చూసుకోవాలని, రైతులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఒకరోజు ముందుగానే టోకన్లు ఇచ్చి యూరియా పంపిణీ చేస్తున్నామని అధికారులు కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. అందరికీ టోకెన్లు వచ్చేలా చూడాలని, మహిళలకు, వృద్ధులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. యూరియా పక్కదారి పట్టకుండా పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారికి చైర్మన్ ఫోన్ చేసి యూరియా పంపిణీ, భూ భారతి చట్టం అమలు తీరుపై ఆరా తీశారు. రైతులకు ఒకే కేంద్రానికి కేంద్రానికి రాకుండా ఎక్కడి వారికి అక్కడే పంపిణీ జరిగేలా చూడాలని కలెక్టర్, డీఏఓలకు సూచించారు. రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా ప్రభుత్వం, అధికార యంత్రాంగం చర్యలు చేపడుతున్న విషయాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో అధికారులు, సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దిగువ జూరాలలో సోలార్ కేంద్రం

జెన్‌కో సీఎండీ డా. హరీశ్


దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న జెన్‌కో సీఎండీ డా. హరీశ్

ఆత్మకూర్: రాష్ట్రంలోని విద్యుదుత్పత్తి కేంద్రాల వద్ద అవకాశం ఉన్నచోట సోలార్ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని టీఎస్ జెన్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా. హరీశ్ తెలిపారు. గురువారం జూరాల ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాలను సందర్శించారు. దిగువ జూరాల వద్ద 100 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని.. 20 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అలాగే కొత్తగూడెంలో కూడా సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది దిగువ జూరాలలో రికార్డుస్థాయిలో విద్యుదుత్పత్తి చేపట్టి లక్ష్యాన్ని అధిగమించడం అభినందనీయమన్నారు. ఎగువన కూడా లక్ష్యానికి చేరువలో ఉన్నారని చెప్పారు. బదిలీలు చేపట్టాలని, ఖాళీలను భర్తీ చేయాలని ఉద్యోగులు సీఎండీని అభ్యర్థించగా త్వరలో చేపడతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట డైరెక్టర్ బాలరాజు, ఎస్‌ఈలు శ్రీధర్, సురేష్, సిబ్బంది ఉన్నారు.

డైవర్షన్ పనులు పక్కాగా చేపట్టాలి

కేంద్ర అటవీశాఖ డీజీ చంద్రశేఖర్



చిన్నదర్పల్లి బీట్ పరిధిలో అటవీభూమి, చెట్లను పరిశీలిస్తున్న డీజీ చంద్రశేఖర్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: చిన్నదర్పల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలోని జాతీయ రహదారి విస్తరణలో ఫారెస్ట్ డైవర్షన్ పనులు పక్కాగా చేపట్టాలని కేంద్ర అటవీశాఖ డీజీ చంద్రశేఖర్ జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రానికి సమీపంలోని చిన్నదర్పల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో జాతీయ రహదారి విస్తరణలో కోల్పోతున్న అటవీ భూమి, చెట్లను ఆయన పరిశీలించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల నష్టానికి సంబంధించి ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా డైవర్షన్ పనులు పక్కాగా చేపట్టాలని డీఎఫ్ఓ సత్యనారాయణకు సూచించారు. విస్తరణలో పోతున్న అటవీ భూమికి బదులుగా మరోచోట ఇవ్వడం, చెట్లకు బదులుగా మరోచోట నాటడం వంటి పనుల్లో ఎలాంటి జాప్యం జరగరాదని సూచించారు. అనంతరం మహబూబ్‌నగర్ సమీపంలోని దొడ్డలోనిపల్లి ఫారెస్ట్ బీట్ పరిధి ప్లాంటేషన్, మయూరీ పార్క్‌ను సందర్శించారు. పార్క్‌లో ఏర్పాట్లు, మొక్కలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి అబ్దుల్‌హాయ్, జాతీయ రహదారి ఈఈ తదితరులు పాల్గొన్నారు.


మయూరీ పార్క్‌ను పరిశీలిస్తున్న అటవీ డీజీ

జూరాలకు కొనసాగుతున్న వరద

8 క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల


జూరాల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

ధరూరు/ఆత్మకూర్/రాజోళి/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద నిలకడగా కొనసాగుతోందని పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం 1,02,950 క్యూసెక్కులు ఉండగా.. గురువారం రాత్రి 8.30 ప్రాంతంలో 92 వేల క్యూసెక్కుల తగ్గినట్లు చెప్పారు. దీంతో ప్రాజెక్టు 8 క్రస్ట్‌గేట్లను ఎత్తి 55,928 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తికి 40,324, ఆవిరి రూపంలో 70, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 670, భీమా లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.651 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

586.515 మి.యూ. విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో గురువారం ఉత్పత్తి వేగవంతంగా కొనసాగిందని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 279.387 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 307.128 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామని, ఇప్పటి వరకు 586.515 మి.యూ. విజయవంతంగా పూర్తి చేసినట్లు వివరించారు.

సుంకేసులకు కొనసాగుతున్న వరద..

సుంకేసుల జలాశయానికి గురువారం ఎగువ నుంచి 73 వేల క్యూసెక్కుల వరద రాగా.. 17 గేట్లను మీటర్ మేర తెరిచి 70,312 క్యూసెక్కులు దిగువకు వదిలినట్లు జేఈ మహేంద్ర వివరించారు. అలాగే 2,626 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు సరఫరా చేసినట్లు తెలిపారు.

శ్రీశైలం మూడు గేట్లు ఎత్తి..

ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహం పెరగడంతో గురువారం శ్రీశైలం ఆనకట్ట మూడు గేట్లు ఒక్కొక్కటి పది అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని వదిలారు. జూరాల స్పిల్‌వే నుంచి 55,928 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 40,324 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 67,872 క్యూసెక్కుల వరద జలాశయం చేరుతుందని.. జలాశయం స్పిల్‌వే ద్వారా 82,710 క్యూసెక్కులు, భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 31,012 క్యూసెక్కులు దిగువనున్న నాగార్జునసాగర్‌కు వదిలినట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం జలాశయంలో 883.9 అడుగుల నీటి మట్టం.. 209.1579 టీఎంసీల నీటి నిల్వ ఉందని చెప్పారు. భూగర్భ కేంద్రంలో 17.179 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 15.608 మి.యూ., విద్యుదుత్పత్తి చేశారు.

మహిళ మెడలో మంగళసూత్రం చోరీ


మహిళ వెనకాల వస్తున్న వ్యక్తి


బైక్‌పై పరారవుతున్న దొంగలు

బైక్‌పై పరారైన దొంగలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట ఫ్రీజన్ రోడ్డులో గురువారం గోదా నాగలక్ష్మి అనే మహిళ మెడలో గుర్తు తెలియని దుండగులు పుస్తెలతాడు (బంగారుగొలుసు) చోరీ చేశారు. స్థానికంగా నివాసముంటున్న నాగలక్ష్మి రేషన్ దుకాణానికి వెళ్లి ఇంటికి తిరిగి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమెను ఫాలో అవుతూ వచ్చాడు. నిర్మానుష ప్రాంతంలో మెడలోని గొలుసు చోరీ చేసినట్లు బాధితురాలు తెలిపారు. అనంతరం ఎన్ఎస్125 బైక్‌పై సిద్ధంగా ఉన్న మరో దుండగుడితో కలసి పరారైనట్లు పేర్కొన్నారు. బాధితురాలు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ మల్లేష్ సంఘటనా స్థలానికి చేరుకొని సమీపంలోని సీసీ కెమెరాల రికార్డులు పరిశీలించారు. చోరీ అయిన గొలుసు మూడు తులాలు ఉంటుందని బాధితురాలు వాపోయింది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 12 తులాల బంగారు, 2 కేజీల వెండి ఆభరణాలు అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలులో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జాలం బాలమ్మ భర్త నర్సింహతో కలిసి బుధవారం జిల్లా కేంద్రంలోని పెద్దమ్మ ఇంటికి వెళ్లి రాత్రికి అక్కడే ఉన్నారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తలుపులు విరగ్గొట్టి ఉండటంతో పాటు బీరువాలోని వస్తువులు చిందర వందరగా పడి ఉండటాన్ని గమనించారు. గుర్తు తెలియని వ్యక్తులు బీరువాలోని 12 తులాల బంగారు, 2 కేజీల వెండి ఆభరణాలు, రూ.11 వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

నవాబుపేట: చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతైన ఘటన మండలకేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దేపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ జావిద్ (35), బుచ్చయ్య ఇద్దరు బుధవారం చేపల వేటకు వెళ్లారు. కాగా జావిద్ చేపల పట్టుకునే క్రమంలో చెరువు లోపలికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. బుచ్చయ్య గమనించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ విక్రమ్ గజ ఈతగాళ్లను రంగంలోకి దింపి మరో సారి గాలింపుచర్యలు చేపట్టారు. రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. కాగా జావిద్‌కు భార్య అన్వీర్‌తో పాటు నలుగురు కుమార్తెలు ఉన్నారు.

కంటైనర్‌ను ఢీకొట్టిన కారు


నుజ్జునుజ్జయిన కారు ముందు భాగం


రోహిత్ మృతదేహం

ఒకరి దుర్మరణం, ఇద్దరికి గాయాలు

జడ్చర్ల: పట్టణంలోని 44వ నంబర్ జాతీయ రహదారి ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ముందు వెళ్తున్న కంటెయినర్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు గాయాల పాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. సీఐ కమలాకర్ కథనం మేరకు హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వైపునకు వెళ్తున్న కంటెయినర్‌ను బ్రిడ్జిపై వెనుక నుంచి అతి వేగంగా కారు ఢీకొట్టింది. ప్రమాదంలో డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న రోహిత్ (30) అక్కడికక్కడే మృత్యువాత పడగా.. డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారందరూ హైదరాబాద్‌లోని కొంపల్లికి చెందిన వారిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో బల్లి కలకలం

- ఆహారం పారబోత.. మళ్లీ వండి విద్యార్థులకు అందజేత
- ఉప్పేరు ఉన్నత పాఠశాలలో ఘటన.. ఎంఈఓ విచారణ


వంట ఏజెన్సీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో బల్లి పడిన ఘటన మండలంలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. ధరూరు మండలంలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం విద్యార్థులకు వంట ఏజెన్సీ వారు రోజులాగే భోజనం సిద్ధంచేసి ప్లేట్లలో వడ్డించారు. అనంతరం విద్యార్థులు చెట్ల కింద కూర్చొని భోజనం చేస్తుండగా ఓ విద్యార్థి ప్లేట్‌లో బల్లి కనిపించింది. దీంతో వెంటనే విషయాన్ని ఇతర విద్యార్థులకు తెలియజేయడంతో ప్లేట్లలో ఉన్న భోజనాన్ని పారబోశారు. అయితే, చెట్ల కింద కూర్చుని తింటుండగా పైనుంచి బల్లి పడి ఉండవచ్చునని ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ వారు చెబుతుండగా.. విద్యార్థులు కూరలోనే వచ్చిందంటూ సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు వైరల్ అయ్యింది. విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఎంఈఓ రవీంద్రబాబు గురువారం పాఠశాలకు చేరుకుని సంఘటనపై ఆరా తీశారు. పిల్లలు చెట్ల కింద కూర్చుని తింటుండగానే చెట్టు పైనుంచి బల్లి పడి ఇలా జరిగిందని ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ మహిళలు వివరించారు. ఎవరికీ ఎలాంటి ఆరోగ్య సమస్య తలెత్తలేదని తెలిపినట్లు ఎంఈఓ తెలిపారు. ఇదిలా ఉండగా.. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష, యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రంగస్వామి తదితరులు పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. వంట ఏజెన్సీ నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగిందని, సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని రామాంజనేయులు, మనోజ్ కుమార్, గోపాల్, విజయ్ తదితరులు ఎంఈఓకు వినతిపత్రాన్ని అందజేశారు.